01ATP18_01ATP18.qxd 18-04-2023 PM 11:14 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 19 ఏప్రిల్ 2023 పేజీలు : 04

# కన్నడ రాజకీయాల్లో గాలి బ్రదర్స్..!

- హాట్ హాట్‌గా బళ్లారి సిటీ నియోజకవర్గ ఎన్నికలు
- బావా మరదలు మధ్య పోటీ..!
- గాలి బ్రదర్స్ ముగ్గురు ఎన్నికల బరిలోనే.. !


గంగావతిలో నామినేషన్ వేస్తున్న గాలి జనార్ధన్‌రెడ్డి


గాలి కరుణాకర్‌రెడ్డి


గాలి సోమశేఖర్‌రెడ్డి,



గాలి లక్ష్మి అరుణ

అనంతపురం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త బ్యూరో

కర్ణాటకలో ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో గాలి జనార్ధన్‌రెడ్డి సోదరుల పరిస్థితి ఎలా ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. మైనింగ్ అధినేత గాలి జనార్ధన్‌రెడ్డి కొత్తగా కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ (కెఆర్‌పిపి) సొంతంగా ఏర్పాటు చేసి ఎన్నికల బరిలో దిగుతున్నారు. కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ తరుపున గాలి జనార్ధన్‌రెడ్డి కొప్పం జిల్లా గంగావతి నుంచి ఎన్నికల బరిలో దిగుతారు. గాలి జనార్ధన్‌రెడ్డి సతీమణి గాలి లక్ష్మి అరుణ కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ తరుపున బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు. గాలి జనార్ధన్‌రెడ్డి సోదరుడు గాలి సోమశేఖర్‌రెడ్డి బిజెపి అభ్యర్థిగా అదే బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి బరిలో దిగారు. దీంతో బావ మరదళ్ల మధ్య సవాల్ అన్నట్లు బళ్లారి ఎన్నికలు ఉన్నాయి. బళ్లారి సిటీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తనయుడు నారా భరత్‌రెడ్డి ఎన్నికల బరిలో దిగారు. దీంతో బళ్లారిలో త్రిముఖ పోటీ నెలకొంది. బళ్లారి సిటీలో బిజెపి అభ్యర్థిగా బరిలో దిగిన గాలి సోమశేఖర్‌రెడ్డి సిట్టింగ్ బిజెపి ఎమ్మెల్యే. 2018లో బిజెపి తరుపున ఎన్నికయ్యారు. 2013లో పోటీ చేయలేదు. అంతకు ముందు కూడా బళ్లారి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. బళ్లారి మేయర్‌గా, కార్పొరేటర్‌గా గాలి సోమశేఖర్‌రెడ్డి పని చేసిన అనుభవం ఉంది. బళ్లారి సిటీలో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. మైనింగ్ అధినేత గాలి జనార్ధన్‌రెడ్డి ఉమ్మడి బళ్లారి జిల్లాలకు, చుట్టుపక్కల జిల్లాల్లో రాజకీయాల్లో ముఖ్యంగా బిజెపి తరుపున గతంలో కీలకంగా పని చేశారు. ఆ సమయంలో బళ్లారి సిటీలో గాలి సోమశేఖర్‌రెడ్డి, రూరల్‌లో శ్రీరాములు కీలకంగా పని చేశారు. అయితే భారతీయ జనతాపార్టీ తనను గుర్తించ లేదని తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్న కారణాలతో ఇటీవల కాలంలో బిజెపి పార్టీకి దూరమై గాలి జనార్ధన్‌రెడ్డి కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీని కొత్తగా ప్రకటించి బిజెపి అభ్యర్థులకు సవాల్‌గా నిలిచారు. కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ తరుపున ఇప్పటి వరకు కర్ణాటకలో 40 స్థానాలకుపైగానే అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం. కాంగ్రెస్, బిజెపిల్లో రెబల్స్ కూడా కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ తరుపున టికెట్లు ఇచ్చి ఎన్నికల బరిలో దింపుతుండటం చర్చనీయాంశంగా మారింది. కర్ణాటకలో 13వతేదిన ప్రారంభమైన నామినేషన్ల పర్వం 20వ తేదిన ముగుస్తుంది. మే 10వ తేదిన శాసనసభ ఎన్నికలకు ఒకేసారి పోలింగ్ ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్-బిజెపి పార్టీలు నువ్వా నేనా అన్న రీతిలో పోటీ పడుతుంటే, కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ తరుపున గాలి జనార్ధన్‌రెడ్డి అభ్యర్థులను నిలపడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ఫలితాలు వస్తే తప్పా గాలి జనార్ధన్‌రెడ్డి ప్రభావం ఏ మేరకు ఉంటుందన్నది చెప్పలేం. ఇదిలా ఉండగా మైనింగ్ అధినేత గాలి జనార్ధన్‌రెడ్డి తెలుగు వాళ్లు ఎక్కువగా ఉండటంతోపాటు బళ్లారి జిల్లా సమీపంలో ఉన్న గంగావతిలో పోటీ చేయడం రాజకీయం రసవత్తరంగా మారింది. ఆ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్బాల్ అన్సారి, బిజెపి అభ్యర్థిగా తరన్న మునళీలు పోటీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బళ్లారి జిల్లాలోకి గాలి జనార్ధన్‌రెడ్డి ప్రవేశించే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో బళ్లారి జిల్లా వెలుపలి నుంచే రాజకీయాలు చేయాల్సి ఉంటుంది. కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ అధ్యక్షులు గాలి జనార్ధన్‌రెడ్డి మరో సోదరుడు గాలి కరుణాకర్‌రెడ్డి ఉమ్మడి బళ్లారి జిల్లాలోని అర్సనహళ్లి నియోజకవర్గం నుంచి బిజెపి తరుపున పోటీ చేస్తున్నారు. అలాగే శ్రీరాములు నాకు సోదర సమానులు నాకు ఆత్మలాంటి వారని సభలు, సమావేశాల్లో గతంలో గాలి జనార్ధన్‌రెడ్డి చెప్పేవారని, జనార్ధన్‌రెడ్డి సన్నిహితులు చెబుతుంటారు. ప్రస్తుత ఎన్నికల్లో మాజీ మంత్రి శ్రీరాములు కూడా బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి బిజెపి తరుపున పోటీ చేస్తున్నారు. శ్రీరాములుకు పోటీగా కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే నాగేంద్ర బరిలో ఉన్నారు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు జిల్లా సరిహద్దుల్లో ఉన్న కర్ణాటకలోని బళ్లారి ఎన్నికల రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

### అజ్ఞాతాన్ని వీడి అనిశ్చితికి తెరదించి

# రాజకీయం వైపుకు రఘువీరా

- ఆధ్యాత్మికం వైపు నుండి తిరిగి రాజకీయలకు రఘువీరా - ఎట్టకేలకు రాజకీయాలలోకి పునఃప్రవేశం చేసిన రఘువీరా


మాట్లాడుతున్న డాక్టర్ రఘువీరారెడ్డి

మడకశిర ఏప్రిల్ 18 ప్రభాతవార్త;

సుదీర్ఘ కాలం పాటు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమంలో ఉంటూ సొంత గ్రామమైన నీలకంఠాపురంలో దేవాలయాల నిర్మాణం చేపట్టి ఆధ్యాత్మిక చింతనతో దైవ సన్నిధిలో నిత్యం దేవతారాధనతో ఉన్న రఘువీరారెడ్డి కర్నాటక రాష్ట్రంలో జరుగబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తన అనిశ్చితికి తెరదించి ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం స్థానిక శీతల గిడ్డంగి ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ మిగతా 4 లో





















# ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి స్థాయిలో చేరుకోవాలి

### -వారంలోగా పురోగతి కనిపించాలి -కలెక్టర్ పి.ఆరుణ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

శ్రీసత్యసాయిజిల్లా, ఏప్రిల్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:

వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాంలో పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలియజేశారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రీసర్వే, హౌసింగ్, ఇంటి పట్టాల పంపిణీ, జాతీయ రహదారులకు భూసేకరణ, స్పందన, ఉపాధి హామీ, వ్యవసాయ అనుబంధ శాఖలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రీసర్వేలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి స్థాయిలో గురువారం నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే పెగ్ మార్కింగన ప్రక్రియను 27వ తేది నాటికి పూర్తి చేయాలని, గ్రౌండ్ టు థింగ్, గ్రౌండ్ వ్యాల్యూడేషన్ పూర్తయిన అనంతరం పెండింగ్‌లో ఉన్న 11 గ్రామాల్లో 7 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ ఈ నెల 19 నాటికి విడుదల చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం సకాలంలో రీ సర్వే పులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, భూహక్కు పత్రాలను ఆలస్యం చేయకుండా పంపణీ చేయాలని, జిల్లాలో వివిధ జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నాన్ స్టార్టెడ్‌లో ఉండి మొదలు కానీ మిగతా 4 లో

# ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం

### జిల్లా ఎస్పీలకు డిఐజి అమ్మిరెడ్డి పిలుపు




అనంతపురం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త ప్రతినిధి

గ్రామస్థాయి నుంచి క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్ అమ్మిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలోని గ్రామ, వార్డు మహిళా పోలీసులతో స్థానిక పోలీసుమ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ గ్రామ కానిస్టేబుల్, మహిళా పోలీసు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎస్‌హెచ్ఓ, డీఎస్పీలతో లైజన్లో ఉండాలన్నారు. గ్రామం లేదా వార్డు స్థాయిలో నేరాలు జరగకుండా, నేరాలు తీవ్రం కాకుండా ఈ సమాచారాన్ని పోలీసు అధికారులకు చేరవేయాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు నెరపాలన్నారు. గ్రామాల్లో విచక్షణాత్మకంగా వ్యవహరించాలన్నారు. మహిళా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా వేయాలన్నారు. మంచి పనులు చేసే వారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. రానున్న రోజుల్ల మరింత అప్రమత్తంగా ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ, వార్డులలోని ప్రజలతో మంచి సతంబంధాలు కొనసాగించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తుండడం అభినందనీయమని చెప్పారు. మహిళా వ్యవస్థ ఏర్పాటు అయ్యాక గణనీయమైన ఫలితాలు చూస్తున్నామని అన్నారు. ఇంకా మెరుగైన సేవలు అందించాలని కోరారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కులవివక్ష, బాల్య వివాహాలు, తదితర అసాంఘిక దురాచారాలు అసాంఘిక కార్యకలాపాలపై నిఘా వేయాలన్నారు. దిగువ స్థాయిలోని సమస్యలను మొగ్గలోనే తుంచేలా వ్యవహరించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ అప్పజెప్పిన గ్రామాన్ని మిగతా 3 లో

# ప్రత్యక్ష రాజకీయాల్లోకి మాజీ మంత్రి రఘువీరారెడ్డి



.అనంతపురం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి మళ్లీప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఇక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని ప్రకటించడం విశేషం. 2019లో శాసనసభ ఎన్నికల తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలో ఆధ్యాత్మిక సేవలో రఘువీరారెడ్డి మునిగిపోయారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా అధునాథన హంగులతో పెద్ద పెద్దదేవాలయాలను నీలకంఠాపురంలో నిర్మించి నిత్యం రఘువీరారెడ్డికుటుంబం ఆద్యాత్మిక సేవలో ఉంటున్నారు. నీలకంఠాపురం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌గా తక్కువ కాలంలో గుర్తింపు వచ్చాయి. 2019 ఎన్నికల తర్వాత ఇప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. భవిష్యత్తులో ఏ పార్టీలో చేరుతారు..? కాంగ్రెస్‌లోనే ఉంటారా లేదా.. తదితర ప్రశ్నలను విలేకర్లు గుచ్చిగుచ్చి ప్రశ్నించినప్పటికీ ఇప్పుడు రాజకీయాల గురించి ఏ మీ మాట్లాడనని రఘువీరారెడ్డి సుతిమెత్తగానే సమాధానం చెబుతూ వచ్చారు. ఏ పార్టీ వారు కలిసినా మాట్లాడే వారే మిగతా 4 లో

# 2024 ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి వస్తుంది

- 2024 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, 2 ఎంపి స్థానాల్లో గెలుస్తాం
- రాప్తాడులో రాక్షసపాలన సాగుతోంది - రాప్తాడులో కార్యకర్తలు కష్టపడి పనిచేస్తున్నారు
- నారా లోకేష్ పాదయాత్రతో కార్యకర్తల్లో, పార్టీ క్యాడర్‌లో నూతనోత్తేజం
- కడప జోన్-5 సదస్సులో మాజీ మంత్రి పరిటాల సునీత


నారా చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

వైసిపి అధికారం చేపట్టినప్పటి నుండి రాప్తాడు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, ఆయన సోదరులు అక్రమాలు, అన్యాయాలతో పాటు దారుణాలకు ఒడిగడుతున్నారని, రాప్తాడు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి పరిటాల సునీత టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడును కోరారు. కడప నగరంలోని పుత్తా ఎస్టేట్స్ లో తెలుగుదేశంపార్టీ జోన్-5 సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ ముఖ్యమంత్రి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పార్టీలోని ప్రముఖులతో పాటు 5 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని తేదేపా మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు హాజరయ్యారు. ఇదే కార్యక్రమానికి రాప్తాడు నియోజకవర్గం నుండి మాజీ మంత్రి పరిటాల సునీత హాజరై ప్రసంగించారు. రాప్తాడు నియోజకవర్గంలో భూదందాలు, మట్టి మాఫియా, ఇతర అరాచకాలు అధికమయ్యాయన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు చేస్తున్న ఆగడాలకు అంతేలేకుండా పోతోందన్నారు. పేద ప్రజలను కొట్టి భూములను బలవంతంగా రాయించుకుంటున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంపై మిగతా 3 లో

# కార్పొరేట్-ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు...!

- విద్యార్థుల ఇళ్లకు వెళ్ళి క్యాంపెయిన్ చేస్తున్న లెక్చరర్లు, టీచర్లు - ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకుండానే
- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న వైనం - తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు, విద్యాశాఖ

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

**ముందస్తు అడ్మిషన్లు కోసం కార్పొరేట్-ప్రైవేట్ విద్యాసంస్థలు బరితెగిస్తున్నాయి. తమ వద్ద పనిచేస్తున్న లెక్చరర్స్,టీచర్లను క్యాంపెయిన్లకు పంపి అడ్మిషన్లు చేయించుకుంటున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకుండానే అడ్మిషన్లు కోసం క్యాంపెయిన్ చేస్తుండటం గమనార్హం.**




ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు వెయ్యికి పైగా కార్పొరేట్-ప్రైవేట్ స్కూల్స్, వందల సంఖ్యలో జూనియర్ కళాశాలలున్నాయి. అనంతపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం, లేపాక్షి, గోరంట్ల, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్-ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు ఎక్కువ సంఖ్యలో వున్నాయి. ఆ ప్రాంతాల్లోని పలు కార్పొరేట్-ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు ఇప్పటికే వచ్చే నూతన విద్యాసంవత్సరం కోసం ముందస్తు అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ఈనెల 30వ తేదీతో ముగుస్తుంది. వచ్చే నూతన విద్యా సంవత్సరం ప్రతి ఎడాది మాదిరిగా జూన్ 12 నుంచి ప్రారంభం అయ్యే అవకాశం వుంది. తాజాగా ఇంటర్ పరీక్షలు, స్పాట్ వాల్యూషన్ పూర్తి అయ్యాయి. ఫలితాలు రావాల్సి వుంది. ఇక టెన్త్ మొయిన్ పరీక్షలు కూడా పూర్తి అయ్యాయి, నేటితో ఒక చిన్న పరీక్ష పూర్తి కానుంది. స్పాట్ వాల్యుషన్ కూడా ఇంకా ప్రారంభం కాలేదు. ఇక వీటి ఫలితాలు కూడా ఎప్పుడోస్తాయో కూడా ఎవ్వరికి తెలియదు. కానీ కొన్ని కార్పొరేట్-ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల యాజమాన్యాలు ఒక అడుగు ముందుకు వేసి ముందస్తు అడ్మిషన్ల కోసం తమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, లెక్చరర్లను గత కొన్ని రోజులుగా విద్యార్థుల ఇళ్లకు పంపించి క్యాంపెయిన్ చేస్తున్నాయి. ఒక రోజు సగం సిబ్బంది మరొక రోజు మిగతా సిబ్బంది క్యాంపెయిన్‌కి వెళ్తున్నారు. తన స్కూల్స్, కళాశాలల్లో లేనవి ఉన్నట్లు క్రియేట్ చేసి కరపత్రాలు-పాంప్లేట్స్ ముద్రించి ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్ళి తమ స్కూల్స్, కళాశాలల్లో చేర్పించాలని వివిధ రకాలుగా మమ్మల్ని ప్రలోబాలకు గురి చేస్తున్నట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కార్పొరేట్ స్కూల్స్, మిగతా 4 లో

04ATP18_04ATP18.qxd 18-04-2023 PM 11:15 Page 1



# సేవాభావాన్ని పెంచడమే రంజాన్ తోఫా ఉద్దేశ్యం

అనంతపురం సిటీ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

పవిత్ర రంజాన్ మాసంలో సేవాభావాన్ని పెంపొందించడమే రంజాన్ తోఫా ముఖ్య ఉద్దేశ్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. మైనార్టీ నాయకులు హిద్దూ, తబ్రేజ్ షారుక్ ఆధ్వర్యంలో 500 మంది పేదలకు మంగళవారం రంజాన్‌తోఫాను పంపిణీ చేశారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని రంజాన్ తోఫాటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని సూచించారు. మత సామరస్యానికి ప్రతీకగా నగరంలో రంజాన్ పండుగను హిందూ, ముస్లిం సోదరులు జరుపు కుంటున్నారన్నారు. పేద ముస్లింలు కూడా సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో రంజాన్‌తోఫాను పంపిణీ చేసిన ముస్లిం యువకులను అభినందించారు. కార్యక్రమంలో వైసీపీ బిసి సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బిసి రమేష్‌గౌడ్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌తోపాటు, పలువురు ముస్లిం యువకులు పాల్గొన్నారు.



వికలాంగులకి రంజాన్‌తోపాటు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత

# మార్వాడీల వ్యాపారాలు దెబ్బకొట్టే ప్రయత్నాలు ఉపేక్షించం

## - ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గించాలి - బిజెపి జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త బ్యూరో

నగరంలో మార్వాడీల వ్యాపారంను దెబ్బతీసే విధంగా వ్యహరిస్తే ఉపేక్షించమని బిజెపి జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంలోని సమస్యలపై నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట బిజెపి నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు సంది రెడ్డి శ్రీనివా సులు మాట్లాడుతూ.. దేశంలో ఎవరైనా ఎక్కడైనా వ్యాపారాలు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. అంతేకాకుండా కలిసి మెలిసి వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారాల మధ్య కొంత మంది నేతలు గొడవలు పెట్టి పబ్బం గడుపుకునే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు బిజెపి కూడా సహకరిస్తుందని అయితే ప్లాస్టిక్ ముసుగులో ప్లాస్టిక్ రహిత వ్యాపారాన్ని కూడా ఇబ్బంది పెట్టే తీరు ను తాము ఖండిస్తు న్నామన్నారు. నగరంలో ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గించాలని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బిజెపి నేతలపై కమ్యునిస్టునేతలు చేసిన ఆరోపణలు నిరాదా రమని కమ్యునిస్టులు ప్రజల మీద పడి దోచుకోవడం అందరికీ తెలుసని ఇప్పటికైనా కమ్యునిస్టు నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని ఆయన సూచించార. నగరంలోని సమస్యలపై బిజెపి పోరా డుతుందని ఆయన స్పష్టం చేవారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లలిత్‌కుమార్, మైనార్టీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫయాజుద్దీన్, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు అశోక్‌రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సూర్య, సీనియర్ నేతలు రామచంద్రయ్య, రత్నమయ్యలతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు

# దాన,ధర్మాలకు ప్రతీక రంజాన్ పండుగ

## ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:

దాన,ధర్మాలకు ప్రతీక రంజాన్ పండుగ కావున ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మంగళవారం అనంత రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయితీలోని పిల్లిగుండ్ల కాలనీలో మసీదు బిలాలే ఆధ్వర్యంలో పేద ముస్లీం కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హజరై ముస్టీం కుటుంబాలకు నిత్యవసర సరుకులు గల రంజాన్ తోఫాను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ పండుగ అని అందులో బాగంగా పిల్లిగుండ్లకాలనీ లోని ముస్లీం కుటుంబాలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్యశంతో మసీదు బిలాలే ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం అబినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో బిసి నాయకుడు ధనుం జయయాద వ్,మండల యూత్ కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసులు,జెడ్పీ టిసి చంద్రకుమార్,ము స్లీం మత పెద్దలు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి,నాయకులు

# జోన్5 సమావేశానికి నాయకులతో కలసి వెళ్లిన మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం రూరల్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం కడప జిల్లాలో నిర్వహించే జోన్5 సమావేశానికి రాప్తాడు నియోజకవర్గ టిడిపి నాయకులతో కలసి మాజీ మంత్రి పరిటాల సునీత తరలివెళ్లారు.పరిటాల సునీతతో కలసి వెళ్లిన వారిలో రూరల్ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ,ప్రధాన కార్యదర్శి పాములాయి రఘు,మాజీ కన్వీనర్ జయకృష్ణ,పేరం హరి,కక్కలపల్లి మాజీ ఎంపిటిసి నారాయణస్వామి,కుమ్మర రామాంజినేయులు,శ్రీనివాసులు లతోపాటు అనేక మంది నాయకులు తరలివెళ్లారు.



జోన్ 5కు నాయకులతో వెళుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

# ఈద్గా శుభ్రత పనులు వేగవంతంగా పూర్తి చేయండి - నగర మేయర్ మహ్మద్ వసీం

అనంతపురం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

రంజాన్ పండుగ సమీపిస్తున్న తరుణంలో నగరంలోని ఈద్గా మైదానం శుభ్రత పనులు పూర్తి చేయాలని నగర మేయర్ మహ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. నగరంలోని హౌసింగ్ బోర్డు ఈద్గా మైదానంలో జరనుగుతున్న పనులను అధికారులు, మైనార్టీ నేతలతో కలిసి మేయర్ వసీం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకుని ఇంకా చేపట్టా ల్సిన పనులపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ పండుగను దృష్టిలో ఉంచుకుని ఈద్గా మైదానంలో ముళ్లపొదలు, చెత్తా చెదారం తొలగింపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఏకెఎస్ ఫయా జ్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ రిజ్వాన్, కార్పోరేటర్లు సైఫుల్లా బేగ్, బాబాఫకృద్దీన్, అబూసాలెహ్, నాయ కులు ఖాజా, దాదు, రవి, మధు, మారాజ్, ఎ1 రఫి, కార్యదర్శి సంగం శ్రీనివా సులు, ఎంహెచ్ఓ గంగాధర్‌రెడ్డి తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈద్గా మైదానంలో పరిశీలిస్తున్న మేయర్ వసీం తదితరులు

# కార్పొరేట్-ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు...!

( మొదటి పేజీ తరువాయి ) కళాశాలల్లో ఇప్పటికే ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు సగానికి పైగా పూర్తి అయినట్లు తెలుస్తుంది. మిగిలిన అడ్మిషన్లను కూడా త్వరగా పూర్తి చేయడానికి పలు ప్రణాళికలు రూపొం దించుకున్నట్లు సమాచారం. ఈ విషయం ఉమ్మడి అనంతపురం జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు, విద్యాశాఖ అధికారులకు తెలిసినా కూడా వాటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కనీసం ఇప్పటికైనా ఉమ్మడి సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్-ప్రైవేట్ విద్యాసంస్థలపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే ఇందుకు సంబంధిత శాఖ అధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

**ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు : డీఈవో యం.సాయిరామ్ :** కార్పొరేట్-ప్రైవేట్ స్కూల్స్ వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ముందుస్తు అడ్మిషన్లు నిర్వహి స్తున్నట్లు ఎవరైనా ఆధారాలతో సహా తమ దృష్టికి తీసుకువస్తే ఖచ్చితంగా అలాంటి స్కూల్స్‌పై చర్యలు తీసుకుంటాము. అడ్మిషన్లు చేసుకోవడానికి ప్రభుత్వం ఒక సమయం ఇస్తుందని, ఆ సమయంలో మాత్రమే అడ్మిషన్లు నిర్వహించాలి. ఏ స్కూల్ అయినా నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు.



డీఈవో యం.సాయిరామ్

**ముందస్తు అడ్మిషన్లు నిర్వహించకూడదు : ఆర్ఐవో సి.సురేష్‌బాబు :** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కార్పొ రేట్-ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఎలాంటి ముం దస్తు అడ్మిషన్లు నిర్వహించకూడదని యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశాము. ఇంటర్ అడ్మిషన్లకు ఎలాంటి షెడ్యూల్ రాలేదు. షెడ్యూల్ వచ్చినప్పు మాత్రమే అడ్మిషన్లు నిర్వహించాలి. ముందస్తు అడ్మిషన్లు నిర్వ హిస్తున్నట్లు ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదు. ఒక వేళ ఆధారా లతో సహా తమ దృష్టికి వస్తే నిబంధ నల ప్రకారంగా కళాశాలపై చర్యలు తీసుకుంటాము.



ఆర్ఐవో సి.సురేష్‌బాబు

# జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం - ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి

తనకల్లు, ఏప్రెల్ 18, ప్రభాతవార్త:

154వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని టిసదుం సచివాలయ పరిధిలోని కాటేపల్లి, తమ్మిశెట్టివారిపల్లి, బిసినివారిపల్లి,బంగారువాండ్లపల్లి నందు కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి సర్పంచ్ సుజాతమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు పూల మాలలు, మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి గ్రామంలో ప్రతి గడపను సందరి ్శంచి ముఖ్యమంత్రి జగన్‌మో హన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గత సమస్యలను తెలుసుకొని అక్కడే గల ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిష్కరిం చదగ్గ సమస్యలను పరిష్కరించారు. సత్వరమే అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించే విధంగా ఆదేశించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలు కాటేపల్లి వద్ద సిమెంట్ రోడ్డు వేయించాలని, అలాగే కరెంట్ పోల్స్ వేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేట్స్, కరెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేసే విధంగా ఎల క్ట్రికల్ ఏఈని ఆదేశించారు. ఇంటి నిర్మాణం కోసం హౌసింగ్ శాంక్షన్ చేయించాని ఎమ్మెల్యేను కోరగా హౌసింగ్ ఇంజనీర్‌తో మాట్లాడి అర్హత కలిగిన వారికి హౌసింగ్ శాంక్షన్ చేయి ంచాలని సూచించారు. అసై న్మెంట్ భూములను సాగు లో ఉన్నవారికి ఇప్పించాలని కోరగా సంబంధిత తహసి ల్దార్‌తో మాట్లాడి అర్హత కలిగిన వారికి అసైన్మెంట్ కమిటీలో పెట్టాలని సూచించారు. తమ్మిశెట్టివారిపల్లి నందు మిడ్ డే మీల్స్‌నకు బిసనవారిపల్లి నుండి సరుకులు అందించే విధంగా చూడాలని ఎమ్మెల్యేను కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేసే విధంగా ఆదేశం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్‌మోహ న్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆనాడు తన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోను రూపొందించి దానిని ఒక భగవద్గీతగా, ఒక బైబుల్‌గా, ఒక ఖురాన్‌గా భావించి అందులో పొందుపరిచిన ప్రతి అంశాన్ని తూచా తప్పకుండా అమలుపరిచారు. 33 సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి డిబిటి విధానం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా అర్హత ప్రామాణికంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తున్నదన్నారు. వీటన్నింటినీ చూడలేని పచ్చ పార్టీ, పచ్చమీడియా జగనన్నపై లేని పోని అభాండాలతో బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తు న్నారని, రాబోవు రోజుల్లో మరోసారి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మధునాయక్, ఎంపిడిఓ పూల నరసిం హులు, ఈఓఆర్‌డి ఆనందయ్య, ఆరోగ్య అధికారి వెంకటరమణ, కన్వీనర్ మధు సూదన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మెన్ ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు నా యుడు, చిన్నప్పరెడ్డి సుజాతమ్మ, రమణారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మెన్ రాందాశాయిరెడ్డి,పొలం సిద్దారెడ్డి, మైనార్టీ నాయకులు బాబా ఫక్రుద్దీన్, ఎంపిటిసి హిమధరెడ్డి, హేమశేఖర్‌రెడ్డి, చిదానందరెడ్డి, కొండా మల్లికార్జున, మీ సేవ రాజశేఖర్‌రెడ్డి, పూల శీన, గౌస్‌పీరు, రహంతుల్లా, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు మరియు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

# మాజీ మంత్రి పల్లె, టిడిపి క్యాడర్‌ను అభినందించిన తెదేపా అధినేత

## - పార్టీ కార్యక్రమాల నిర్వహణలో జోన్-5లో అగ్రహ స్థానం

శ్రీసత్యసాయి జిల్లా, ఏప్రిల్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్ని కార్యక్రమాల అమలులో రాష్ట్రంలోనే మొదటి 10 స్థానాలలో, జోన్-5 నుండి పుట్టపర్తి అగ్రస్థానంలో నిలవడం పట్ల పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డి, మరియు పార్టీ క్యాడర్‌ను తెదేపా అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అబి.నందించారు. మంగళవారం నాడు కడపలోని పుత్తా ఎస్టేట్స్‌లో నిర్వహించిన జోన్-5 టిడిపి నియోజక వర్గాల సమీక్షా సమావేశం నందు పుట్టపర్తి నియోజకవర్గ కార్యకర్తలు ఇదేమీ ఖర్మ క్యాంపెయిన్‌లో రాష్ట్రంలోనే 3వ స్థానం, బాదుడే బాదుడు, గౌరవ సభలు, పార్టీ సభ్యత్వంతో పాటు పార్టీ పిలుపునిస్తున్న అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగో జోన్ 5 పరిధిలోకి వచ్చే 35 నియోజకవర్గాల్లోని క్లస్టర్ ఇంచార్జ్ పనితీరులో అమడగూరు మండల క్లస్టర్ ఇన్‌చార్జ్, మండల అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి పనితీరులో మొదటి స్థానంలో నిలిచారని చంద్రబాబు ప్రశంసించారు. అదే తరహాలో పుట్టపర్తి అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జ్, పార్టీ అధ్యక్షులు రామాంజినేయులు పనితీరు పట్ల అధినేత అభినంది ంచడమే కాకుండా వేదికపై మాట్లాడే అవకాశం కల్పించి ప్రశంసించారు. ఇదే జోన్5 నందు యూనిట్ ఇన్‌చార్జ్‌ల పనితీరులో పుట్ట పర్తి నియోజకవర్గంకు చెందిన బాలగంగాధర్ రెడ్డి మొదటి స్థానంలో ఉన్నారని అధినేత అభినందించి నట్లుతెలుస్తున్నది. ఇదే ఉత్సాహంతో పార్టీ క్యాడర్ మొత్తం ఎన్నికల యేడాది సందర్భంగా మరింత ఉత్సాహంతో పని చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని ఇన్‌చార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డితోపాటు టిడిపి శ్రేణులకు అధినేత చంద్రబాబు పిలుపు నిచ్చారు.



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు

# పెనుకొండను భారతవారసత్వ నగరంగా ప్రకటించాలి

## - చరిత్రకారుడు మైనా స్వామి - లేజర్‌షో, థీంపార్క్, పురావస్తు ప్రదర్శనశాల ఏర్పాటు

## - అభివృద్ధికి రూ.300 కోట్లు కేటాయించాలి

పెనుకొండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

.పెనుకొండను భారత వారసత్వ నగరంగా ప్రకటించాలని చరిత్రకారుడు మైనాస్వామి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని, పలువురు పురప్రముఖులతో కలిసి ఆయన మంగళవారం పెనుకొండ కోట, చారిత్రక కట్టడాలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. పెనుకొండను సుందర వారసత్వ నగరంగా అభి వృద్ధి చేయడానికి రూ.300 కోట్లు కేటాయించాలని కోరారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన నగర పర్యాటక-సాం స్కృతిక అభి వృద్ధిలో వెనుకబడి ఉండడం శోచనీయమన్నారు. ప్రాచీన, పటిష్టమైన, అత్యంత పొడవైన కోటలు ఆంధ్రప్రదేశ్‌లో మూడు మాత్రమే ఉన్నాయన్నారు.

మొదటి కొండవీడు (గుంటూరు జిల్లా), రెండవది పెనుకొండ, మూడవది చంద్రగిరి (తిరుపతిజిల్లా) అని ఆయన వివరించారు. పెనుకొండ మినహా మిగిలిన చోట్ల ఎక్కడ కట్టడాలు లేవన్నారు. ఏడు ప్రాకాల కోట లు, అద్భుత శిల్ప కళా నిలయాలైన హిందూ, జైన ఆలయాలు, సుందర పుష్కరి ణులు, మెట్ల బావులు, రాజభవనాలు చరిత్ర నిదర్శనం అన్నారు. పార్శ్వ నాథ, అజితనాథ, జైన తీర్థం కరుల గుడులు, రామచంద్ర కాశీ విశ్వేశ్వర సని ధులు అర్హలైన శిల్పశోభతో అలరారుతున్నాయన్నారు. వందల సంఖ్యలో శాసనాలున్నాయి. వాటిలో పదుల సంఖ్యలో పాడయ్యాయి. వార సత్వ నగరంగా ప్రకటించడానికి అన్ని అర్హతలున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఒక యథాస్థితి నివేదికను రూపొ ందించడం ద్వారా అభివృద్ధి పనులు అమలు చేయాలని ఆయన కోరారు. గగన మహల్ నుంచి పెద్ద కొండకు తీగ మార్గం (రోప్ వే), పెనుకొండ చరిత్రను వివరించే లేజర్ షో, థీం పార్కు, అంత ర్జాతీయ స్థాయి పురావస్తు ప్రదర్శనశాల, కళా-సాం స్కృతిక వేదిక, అందంమైన ఉద్యాన వనాలను ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. భారత పర్యటక పటంలో పెనుకొ ండను సమున్నత స్థాయిలో నిలపాలని కేంద్ర పర్యటక శాఖకు చిత్ర కారుడు విన్నవించారు. పుర ప్రముఖులు, చరిత్రకారులు ఢిల్లీ వెళ్లి మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ సమావేశంలో విహెచ్‌పి నాయకులు వేదవ్యాస్, రామకృష్ణ, సుధాకర్‌గుప్తా, నాగరాజు, త్రినాథ్, యతి తదితరులు పాల్గొన్నారు.



శాసనాలను చూపుతున్న మైనా స్వామి



మాట్లాడుతున్న మైనా స్వామి

# అజ్ఞాతాన్ని వీడి అనిశ్చితికి తెరదించి రాజకీయం వైపుకు రఘువీరా

( మొదటి పేజీ తరువాయి ) నాయకులతో, కార్యకర్తలతో అత్యవసరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కర్నాటక అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తానని మాజీ మంత్రి డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి అన్నారు. కర్నాటక రాజధాని బెంగళూరు పరిధిలోని 13 నియోజకవర్గాల పరిధిలోని పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఇందులో భాగంగా కర్ణాటకలో మీ బంధువులకు సన్నిహితులకు నేటి నుండి ప్రచారం చేయాలని తెలిపారు. నేటి నుండి కర్నాటకలో పాగా వేసి అక్కడి అభ్యర్థుల విజయానికి తన అనుచరులతో కలసి ప్రచారం చేసి వారి విజయానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కెటి.శ్రీధర్, గంగులవాయి పాళ్యం ప్రభా కర్‌రెడ్డి, బచ్చల య్య పాళ్యం నరసింహమూర్తి, కాంట్రాక్టర్ ఈశ్వరప్ప, రవీంద్ర ప్ప, సురంగాల నాగరా జు, మందలపల్లి నాగరాజు, రాళ్లపల్లి వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

కర్నాటకలో ప్రచారం చేస్తున్న రఘువీరారెడ్డి



# ప్రభుత్వ లక్ష్యాలను పూర్తీ స్థాయిలో చేరుకోవాలి

( మొదటి పేజీ తరువాయి ) 10,190 గృహ నిర్మాణాలను వెంటనే బిలోబేస్మెంట్ లెవల్‌లోకి తీసుకురావాలని, ఈ నెల 28వ తేదిలోగా అన్ని ఇళ్ళు బిబిఎల్‌లోకి రావాలన్నారు. కేటాయించిన స్థలం వద్దకు లబ్ధిదారులను తీసుకెళ్ళి ఫోటో తీసి జియో ట్యాగింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తీ చేయాలని, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడి ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఉపాది హామీ కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఎక్కువ మంది కుటుంబాలకు వంద రోజుల పని కల్పించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు, భవన నిర్మాణాలను పురోగతిలోకి తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయ భవనాలు 8, రైతుభరోసా కేంద్రాలు 31, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు 32 ఇంకా మొదలు కాలేదని, ఆయా భవన నిర్మాణాలకు స్థల సమస్యలను వెంట నే పరిష్కరించాలన్నారు. వారంరోజుల్లోపు నిర్మాణాలు మొదలయ్యేలా ప్రత్యేక దృష్టి సారించి పురోగతి చూపించాలన్నారు. వ్యవసాయం క్రింద ఈ క్రాఫ్ బుకింగ్‌కు సంబంధించి రైతుల ఈ కెవైసి ప్రక్రియ 100 శాతం పూర్తీ చేయాలన్నారు. వైఎస్ఆర్ యంత్రో సేవ పథకం కింద జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అను గుణంగా పిహెచ్‌సి గ్రూపులకు యంత్రాలను పంపిణీ చేసేలా చూడాలన్నారు. ఈ విషయమై వారంలో పురోగతి చూపించాలని, జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల క్రింద చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తీ చేసే విధంగా చూడాలని, ప్రభుత్వ లక్ష్యాలను పూర్తీ స్థాయి లో చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కొండయ్య, సిపిఓ విజయ్‌కుమార్, పిఆర్ఎస్ఇ గోపాల్ రెడ్డి, హౌసింగ్ పిడి చంద్రమౌళిరెడ్డి, సర్వ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ, జిల్లా వ్యవసాయా ధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, పట్టు పిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, డిపిఓ విజయ్‌కుమార్‌రెడ్డి, డిసిఓ కృష్ణనాయక్, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.



హాజరైన వివిధ శాఖల ఉన్నతాధికారులు

# ప్రత్యక్ష రాజకీయాల్లోకి మాజీ మంత్రి రఘువీరారెడ్డి

( మొదటి పేజీ తరువాయి ) కానీ రాజకీయాల గురించి ప్రస్తావించే వారు కాదు. పిసిసి అధ్యక్షులుగా రఘువీరారెడ్డి పని చేసిన తర్వాత డా.శైలజానాథ్ పిసిసి అధ్యక్షులు అయ్యారు. ఆయన పదవి కాలం ముగిసింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రుద్రమరాజు కొనసాగుతున్నారు. డా.శైలజానాథ్ పిసిసి అధ్యక్షులుగా పని చేసినప్పుడు ఎక్కడ సభలు, సమావేశాల్లో పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికల్లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి సేవలను కాంగ్రెస్ అధిష్టాన వర్గం వినియోగించుకోవాలని యోచించింది. ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో కర్ణాటకకు సంబంధించి పలు ప్రాంతాలు ఉండటంతో రఘువీరారెడ్డిని పార్టీ ప్రచారం కోసం క్రియాశీలకంగా వాడుకోవాలని కాంగ్రెస్ అధిష్టాన వర్గం నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో పిసిసి మాజీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డిని ఇటీవల ఢిల్లీకి కాంగ్రెస్ అధిష్టాన వర్గం పిలిపించి పార్టీలో చురుగ్గా పని చేయాలని చెప్పడంతోపాటు పలు విషయాలు చర్చించినట్లు సమాచారం. ఇటీవలే బెంగుళూరు సిటీ ఎన్నికల పరిశీలకులుగా కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్.రఘువీరారెడ్డిని నియమించింది.

ఈ నియామకం జరిగిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే మంగళవారం (18-4-2023) ఉదయం మడకశిర శివారులోని కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్‌లో మడకశిర, హిందూపురం ప్రాంత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఎన్.రఘువీరారెడ్డి నిర్వహించారు. కర్ణాటక ఎన్నికల్లో ప్రచారం చేసి అక్కడ కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మీరు కూడా కృషి చేయాలని తన అనుచరులు అయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎన్.రఘువీరారెడ్డి దిశ నిర్దేశం చేయడం చర్చనీ యాంశంగా మారింది. మడకశిర సమావేశం తరువాత సరిహద్దుల్లోని కర్ణాటక లోగల పావగడలో కాంగ్రెస్ ఎన్నికల సభలో ఎన్.రఘువీరారెడ్డి పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయడం విశేషం. ఈ సంఘటనతో కర్ణాటకలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ఎన్.రఘువీరారెడ్డి చురుగ్గా పని చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్ణాటక ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో కూడా క్రియా శీలకంగా పనిచేస్తారాలేదా, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు చర్యలు తీసుకుంటారా లేదా అని వేచి చూడాల్సిందే. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ తరుపున ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ .క్యాబినెట్‌లో ఎన్.రఘువీరారెడ్డి కీలకమైన మంత్రి పదవులు నిర్వహించి వైఎస్‌కు కుడిబుజంగా ఉన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత కిరణ్‌కు మార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆ క్యాబినెట్‌లో కూడా ఎన్.రఘువీరారెడ్డి కీలక పాత్ర వహించారు.

ఆ సమయంలో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం పరుగులు పెట్టిం చేందుకు రఘువీరారెడ్డి తదితరులు ఎంతో కృషి చేశారు. శ్రీశైలం లోతట్టు ప్రాంతమైన మాల్యాల వద్ద నుంచి కృష్ణ జలాలను జీడిపల్లి రిజర్వాయర్‌కు నీటిని తీసుకురావడంలో రఘువీరారెడ్డి ప్రస్తుత అనంతపురం సిట్టింగ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ది బాటలో నడిచిందంటే, ఎన్.రఘువీరారెడ్డి చేసిన కృషి అని చెప్పవచ్చు. అనంతపురం జిల్లాలో కూడా వివిధ ప్రాంతాల్లో రహదారులు, భవనాలు, ప్రాజెక్టుల నిర్మా ణానికి దివంగత నేత వైఎస్ఆర్ అండదండలతో మంత్రిగా రఘువీరా రెడ్డి అప్పట్లో చేసిన కృషి మరువలేనిదని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో పిసిసి మాజీ అ ధ్యక్షులు రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయం తీసుకుని కర్ణాటక ఎన్నికల కురుక్షేత్రంలో దిగడం హాట్ టాపిక్‌గా మారింది.